క్లుప్తంగా

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కొయ్యూరు: స్థానిక బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో 2025–26కు సంబంధించి ప్రవేశాలు జరుగుతున్నట్టు ప్రిన్సిపాల్ జగన్నాథరావు ఆదివారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులు ఈనెల 18లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉన్నాయన్నారు. కళాశాలలో అనుభవమైన అధ్యాపకులతో ఉత్తమ బోధన అందిస్తున్నట్టు చెప్పారు.

చట్టాలపై అవగాహన అవసరం



పినలోచలిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జన్ జీవన్ సంఘ్ ప్రతినిధులు

జి.మాడుగుల: మండలంలో పినలోచలి, చింతలగొంది గ్రామాల్లో జన్ జీవన్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం వివిధ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘ్ అధ్యక్షుడు కె.అప్పాజీ మాట్లాడుతూ మోటార్ వెహికల్ చట్టాలపై అందరికీ అవగాహన అవసరమని, లైసెన్సులు, బీమా చేయించుకోవాలని ఆయన తెలిపారు. సంఘ్ ఉపాధ్యక్షుడు మహేష్‌బాబు మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ఐటీడీఏ నిధులు దుర్వినియోగం కాకుండా సక్రమంగా గిరిజనులకు సద్వినియోగం అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో యూత్ క్లబ్, రైతు క్లబ్‌లను ఏర్పాటుచేశారు. సర్పంచ్ పలాసి కృష్ణమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అడ్డతీగల ఎస్‌ఐ వినోద్‌ని కలిసిన మానవహక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు

అడ్డతీగల: పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా రమేష్ అన్నారు. అడ్డతీగలలోని కమిటీ కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలు అంశాలపై మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఆయా అంశాలపై ఏజెన్సీలో సంస్థ తరుపున అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. అంతకుముందు స్థానిక ఎస్‌ఐ వినోద్‌ని కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఓసీ సెల్ అధ్యక్షు డు తాతారావు, నేర సమాచార విభాగ సీనియర్ ఉపాధ్యక్షుడు వీరభద్రరావు, న్యాయ విభాగ సలహాదారుడు రవికుమార్ తదితరు లు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారులకు అవగాహన



పెద్దమునకనగడ్డలో ఉపాధి వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న బాబూరావు

అడ్డతీగల: ఉపాధి వేతనదారులకు ఉపాధి హామీ చట్టంపై జిల్లా లీగల్ సర్వీసెస్ అధారిటీ పారా లీగల్ వలంటీర్ తీగల బాబూరావు ఆదివారం అవగాహన కల్పించారు. మండలంలోని పెద్దమునకనగడ్డలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ వేతనదారులకు పని ప్రదేశంలో కల్పిస్తున్న సౌకర్యాలు, అవలంభిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. వేతనదారులకు పని పొందే హక్కు గురించి వివరించారు. చేసిన పనికి సకాలంలో వేతనాలు రాకపోతే ప్రభుత్వం నుంచి లబ్ధి పొందే విధానంతో పాటు ఈ–శ్రమ్ వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. పోస్టాఫీస్‌లలో అందుబాటులో ఉన్న బీమా పథకాలపై అవగాహన కల్పించారు.

ప్రమాదకర వృక్షాన్ని తొలగించరూ..



ఒరిగి పోయిన ఉన్న ఎండిన చెట్టు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే ఆర్ అండ్ బీ ప్రధాన మార్గంలో వనభసింగి పంచాయ తీ లుంగాపుట్టు మలు పు వద్ద భారీ వృక్షం పూర్తిగా ఎండి పోయి మరింత ఒరిగిపోయింది. భారీ ఈదురుగాలులు, వర్షాలు సమయంలో ఎప్పుడు కూలుతుందోనని భయం భయంగా రాకపోకులు సాగిస్తున్నారు. వృక్షం కూలి ప్రమాదం జరగక ముందే ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు స్పందించి ఎండిన చెట్టును తొలగించాలని వారు కోరుతున్నారు. గతంలో నిలువుగా ఉండే చెట్టు శనివారం రాత్రి వీచిన భారీ గాలులకు చెట్టు ఒరిగిపోవడంతో వాహనచోదకులు మరింత భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

మోక్షమెన్నడో?



రాజవొమ్మంగి నుంచి వయ్యేడు మీదుగా బూరుగపల్లి వెళ్లే రహదారి దుస్థితి



రాళ్లు తేలి అసంపూర్తిగా దర్శనమిస్తున్న ముంజవరప్పాడు గ్రామ రహదారి

- గిరిజనులకు తప్పని కష్టాలు
- అర్ధంతరంగా నిలిచిన రోడ్డు పనులు
- రాళ్లు తేలిన దారులు
- పట్టించుకోని అధికారులు

రాజవొమ్మంగి: ఏజెన్సీలో చాలా ప్రాంతాల్లో రహదారుల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మన్య ప్రాంతాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. దీంతో ఎన్నడూ ఊహించని విధంగా అభివృద్ధి కనిపించింది. గిరిజన గ్రామాల్లో పూర్తి స్థాయిలో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో చాలా ప్రాంతాల్లో పనులు ప్రారంభం కాలేదు..మరికొన్ని చోట్ల పనులు నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కావస్తున్నా మన్యంలో ఒక్క ప్రాంతంలో రోడ్డు చేసిన దాఖలాలు లేవు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులున్నప్పటికీ వాటిని వెచ్చించడం లేదు... పనులు చేయ డం లేదు. అసంపూర్తిగా ఉన్న పనులను పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వ పాలన గిరిజనుల శాపంగా మారింది.


పాలకుల నిర్లక్ష్యం.. గిరిజనులకు శాపం

రాజవొమ్మంగి మండలంలోని ఆ నాలుగు రోడ్లకు మోక్షం ఎప్పుడా అని లోతట్టు గిరిజనులు ఎదురు తెన్నులు చూస్తున్నారు. మండలంలోని కొండలు, గుట్టలు దాటి వెళ్లే గిరిజనుల కష్టాలు తీర్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రహదారుల నిర్మాణం కోసం రూ. 8.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. లోతట్టు ప్రాంత గిరిజనులు సంబరపడ్డారు. తమ రహదారుల కల సాకారమవుతుందని ఆశ పడ్డారు. అయితే పనులు జరిగే సమయంలో ఎన్నికలుకోడ్ రావడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి ఏడాది కావస్తున్నా ఈ రోడ్ల నిర్మాణంలో పాలకులు కినుక వహిస్తుండడం ఆయా గ్రామస్తుల పాలిట శాపంగా పరిణమించింది. ఈ రహదారుల నిర్మాణం నిలిచిపోవడంతో ఎన్నో ఏళ్లుగా రహదారి, రవాణా సదుపాయాల కోసం ఎదురు చూస్తున్న ఆదివాసీల కలలు కలలుగానే ఉండిపోయాయి.

నిధులున్నా.. తాత్సారం ఎందుకు

మండలంలోని రాజవొమ్మంగి నుంచి ఎత్తైన కొండపై గల బూరుగపల్లికి (వయ్యేడు గ్రామం మీదుగా) ఆరు కిలోమీటర్ల బీటీ రహదారికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 3.5 కోట్లు మంజూర య్యాయి. మెటల్ పరచి, ప్రారంభించిన పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. రాళ్లు తేలిన రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో లబ్బర్తి రోడ్ నుంచి డి.మల్లవరంకు రహదారికి జగన్ ప్రభుత్వం నాడు కోటి రూపాయలు మంజూరు చేసింది. ఎన్నికలు సమీపించడంతో పనులు నిలిచిపోయాయి. నేటికీ పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. అదే విధంగా లబ్బర్తి జంక్షన్ నుంచి ముంజవరప్పాడు మీదుగా కింద్రకు రహదారి నిర్మాణం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 3.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ రహదారికి చెంది ఇప్పటి వరకు ఒక కల్వర్టు నిర్మాణం, కొంతమేర పనులు జరిగినా బీటీ రహదారి నిర్మాణం నిలిచిపోయింది. మండలంలోని లోతట్టు ప్రాంతం లోదొడ్డి నుంచి పాకవెల్తి గ్రామానికి రహదారికి జగన్ ప్రభుత్వం నాడు రూ. 1.5 కోట్లు మంజూరు చేసినా పనులు కూడా ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వంతో పాటు ఉన్నతాధికారులు ఆయా అసంపూర్తి పనులు చేసేందుకు ఇసుమంత కూడా ప్రయత్నం చేయకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రహదారి పనులను పూర్తి చేయాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ సమస్యను టీడబ్ల్యూడీఈఈ గౌతమి వద్ద ప్రస్తావించగా ప్రస్తుతం బీటీ రోడ్డు పనులు చేపట్టాల్సి ఉందని, వర్షాలు తగ్గిన వెంటనే పనులు చేపడతామన్నారు.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రహదారి పనులను పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. పనులు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంది. కొత్త రోడ్లు వేయకపోయినా, గతంలో మంజూరైన రోడ్లు అయినా వెంటనే వేయాలి.

– గోము వెంకటలక్ష్మి, ఎంపీపీ, రాజవొమ్మంగి

చిత్తశుద్ధితో పనిచేయాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రహదారుల నిర్మాణం ప్రస్తుత ప్రభుత్వం కావాలనే తాత్సారం చేస్తోంది. కాలయాపన చేయకుండా మండలంలోని ఈ నాలుగు రోడ్ల పనులకు వెంటనే పూర్తి చేయాలి. అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి.

– కనిగిరి దుర్గాప్రసాద్, రాజవొమ్మంగి

త్రుటిలో తప్పిన ప్రమాదం

- లారీ బోల్తా.. స్వల్ప గాయాలతో బయటపడ్డ డ్రైవర్
- రెండు గంటల పాటు నిలిచిన ట్రాఫిక్



ఆంధ్ర- ఒడిశా రోడ్డు అడపవలస సమీపంలో బోల్తా పడ్డ లారీ

డుంబ్రిగుడ: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు మండలం సాగర పంచాయతీ అడపవలస వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ బోల్తా పడడంతో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ సంఘటనపై స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రా నుంచి ఒడిశాలోని కొర్రాపుట్ట జిల్లా జైపూర్‌కు చేపల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. లారీలో డ్రైవర్, క్లీనర్‌లు ఉన్నారు.

ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా క్లీనర్‌కు చిన్నపాటి దెబ్బలతో ప్రమాదం నుంచి గట్టెక్కారు. రహదారికి అడ్డంగా వాహనం బోల్తా పడడంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచింది. స్థానికుల సాయంతో ట్రాక్టర్‌తో లారీని తప్పించడంతో సుమారు రెండు గంటల పాటు నిలిచిన వాహనాలు రాకపోకలు సాగించాయి.

పీవీ రావు జయంతిని విజయవంతం చేయండి

రోలుగుంట : ఈ నెల 12వ తేదీన కాకినాడలో మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు జయంతి కార్యక్రమం విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బుంగా సాయిమాల ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాలలను అణిచి వేయడమే ధ్యేయంగా తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు పనిచేస్తున్నారని విమర్శించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



రాజవొమ్మంగి జెడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌లో 2007–08 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశమయ్యారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా స్థానిక జెడ్పీ పాఠశాలలో సమావేశమై ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొంటూ, పాఠశాల ప్రాంగణంలోనే రోజంతా గడిపారు. నాటి పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని, ఒకొరికొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సాదరంగా పాఠశాలకు ఆహ్వానించి సత్కరించి, వారి దీవెనలు పొందారు. పాఠశాలలోనే వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. అప్పటి హెచ్‌ఎం శ్రీనివాస్ కుమార్, విజయలక్ష్మి దంపతులు, ఎంఈవో సూరయ్యరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం.. వినియోగదారుల సతమతం

అరకులోయటౌన్: అరకులోయ మండలంలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు పడినా సకాలంలో వాటిని తొలగించకపోవడంతో తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని చెబుతున్నారు. మండల కేంద్రానికి అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలతో పాటు సుంకరమెట్ట ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. మండలంలోని సుంకరమెట్ట ఫీడర్ పరిధిలో చొంపి, బస్కీ, శిరగాం, మాడగడ, కొత్తభల్లుగుడ, సుంకరమెట్ట పంచాయతీల పరిధిలోని గ్రామాలతో పాటు బొండాం పంచాయతీ పరిధిలోని కరకవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఏదైనా విద్యుత్ సమస్య తలెత్తితే సిబ్బంది స్థానికంగా లేకపోవడంతో గంటల తరబడి కరెంటు సరఫరా నిలిచిపోయి నానా అవస్థలు పడుతున్నామని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, లైన్‌మెన్‌ల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కింది స్థాయి ఉద్యోగులు స్థానికంగా ఉంటూ విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

ప్రహరీ పనులకు శంకుస్థాపన



బరియల్ గ్రౌండ్ ప్రహరీ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చాణక్య తదితరులు

అరకులోయటౌన్: అరకులోయలోని శరభగుడ గ్రామంలో ఉన్న బరియల గ్రౌండ్‌లో ప్రహరీ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు రేగం చాణక్య , ఎంపీటీసీ సభ్యులు దురియా ఆనంద్‌కుమార్, ఎల్.బి.భీమరాజు, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు కమిడి అశోక్, అరకు అసెంబ్లీ నియోజకవర్గ బూత్ ఇన్‌చార్జి పాంగి విజయ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రేగం చాణక్య మాట్లాడుతూ బరియల్ గ్రౌండ్ స్థలం కబ్జాకు గురవుతుందని గ్రామస్తులు అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం దృష్టికి తీసుకురావడంతో ప్రహరీ నిర్మాణానికి హామీ ఇచ్చి ఉపాధి నిధులు రూ. 15లక్షలు మంజూరు చేశారన్నారు. దీంతో ప్రహరీ నిర్మాణానికి ఇంజినీరింగ్ అధికారుల చర్య లు చేపట్టారన్నారు. త్వరలో ప్రహరీ నిర్మాణంతో కబ్జాదారుల నుండి కాపాడుతామన్నారు. నాయకుడు కిల్లో జగన్నాథం, వార్డు సభ్యుడు మగ్గన్న, స్థానికులు సాల్మన్, సహదేవ్ పాల్గొన్నారు.

16న ఆదివాసీ హక్కుల గర్జన సభ

చింతూరు: ఆదివాసీల సమస్యలపై ఈనెల 16న చింతూరులో ఆదివాసీ హక్కుల గర్జన సభను నిర్వహిస్తున్నట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం చింతూరులో జరిగిన పరిషత్ సమావేశంలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ప్రాంతంలోని ఉద్యోగ నియామకాలన్నీ స్థానిక ఆదివాసీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక డీఎస్సీ చేపట్టి ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. పోలవరం ప్రాజెక్టులో ఆదివాసీ నిర్వాసితులకు చట్ట ప్రకారం భూమికి భూమి, నష్టపరిహారం, ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పించాలని ఆయన డిమాండ్ చేవారు. అమరావతి రైతులకు ఇచ్చిన విధంగానే ఇక్కడి రైతులకు కూడా పరిహారం ఇవ్వాలని ఆయన కోరారు. నాయకులు ప్రసాద్, లక్ష్మణరావు, అప్పారావు, కన్నారావు, రాఘవయ్య, ప్రసాద్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మోదమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం



మోదకొండమ్మ ఉత్సవ విగ్రహం, పాదాలను మోసుకెళ్తున్న భక్తులు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో పలు గ్రామాల్లో మోదకొండమ్మతల్లి ఉత్సవాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. మండలంలోని మినుములూరు, గుర్రగరువు గ్రామాల్లో గిరిజనులు ఉదయాన్నే మోదమ్మ ఉత్సవ విగ్రహాలు, పాదాలు, ఘటాలను పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం శతకంపట్టులో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి మూడు రోజుల ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. శతకంపట్టులో కొలువుదీరిన మోదమ్మ ఉత్సవ విగ్రహం, పాదాలను భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. వనుగుపల్లి పంచాయతీ బిరిమిశాల గ్రామంలోను జాంకారమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

అమ్మవారి ఉత్సవాలకు ముహూర్తపు రాట



రాట ఊరేగింపులో భక్తులు



ఉత్సవం ముహుర్తపు రాట ఏర్పాటులో భక్తులు, కమిటీ సభ్యులు

పెదబయలు: గిరిజనుల ఇలవేల్పు ఆరాధ్య దైవం మోదకొండమ్మ తల్లి ఉత్సవాల ముహూర్తపురాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.బొంజుబాబు, తలారి చక్రధర్ మాట్లాడుతూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలంతా సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. మండల కేంద్రంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో శతకంపట్టు వద్ద ముహూర్తపు రాట కార్యక్రమాన్ని భక్తులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు మోదకొండమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉత్సవాలకు 15 రోజులు ముందుగా శతకంపట్టులో రాట ఏర్పాటు ఆనవాయితీగా పేర్కొన్నారు. 15 రోజుల పాటు ముహూర్తపురాటకు ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అనంతరం ఉత్సవాలు ప్రారంభం రోజున ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, శతకంపట్టులో ఎంతో ఉత్సవంగా పెట్టి మూడు రోజుల పూజల అనంతరం చివరి రోజు భారీ ఊరేగింపుతో ఆలయంలో ఉత్సవ విగ్రహం పాదాలు యథాస్థానంలో అనగా (గుడిలో)చేరుస్తామన్నారు. ఉత్సవ రాట వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపుగా డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లతో శతకంపట్టుకు రాట ఏర్పాటు జరిగింది. మోదకొండమ్మ ఉత్సవాల పనులు ప్రారంభమైనట్టు చెప్పారు. సర్పంచ్ పలాసి మాధవరావు, ఉత్సవ కమిటీ నాయకులు రాధాకృష్ణ , సింహాచలం, మాజీ జెడ్పీటీసీ గంగాభవాని, మాజీ ఎంపీపీ కొండయ్య, గ్రామ పెద్దలు సన్నిబాబు, లక్ష్మణరావు, రమేష్‌కుమార్, మోటర్ యూనియన్ నాయకులు నీలయ్య, కిశోర్. అంజిబాబు, వర్తక సంఘం నేతలు చిన్ని, చిరంజీవి, శశిధర్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిధులతో జోరుగా పనులు

- బుంగాపుట్టు–పూలజల్మా రోడ్డుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.5.20 కోట్ల నిధుల మంజూరు
- నాటి సీఎం జగన్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు గిరిజనుల కృతజ్ఞతలు



పూలజల్మాలో రోడ్డు పనులు

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల బుంగాపుట్టు పంచాయతీ కేంద్రం నుంచి పూలజల్మా గ్రామానికి తారురోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.5.20 కోట్లు మంజూరు కావడంతో రోడ్డు పనులు మొదలయ్యాయి. రహదారి పనులు జరుగుతున్న సమయంలో ఎన్నికల కోడ్ అమలుతో పనులు నిలిచిపోయాయి. అనంతరం ప్రస్తుతం రోడ్డు పనులు మొదలయ్యాయి. రహదారి మార్గంలో కల్వర్టుల పనులు పూర్తయ్యాయి. గత వారం రోజులుగా తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రత్యేక చొరవ వల్లనే రహదారి సమస్య తీరుతుందని బుంగాపుట్టు పంచాయతీ సర్పంచ్ జర్రెల నోబిన, ఆయా గ్రామాల గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా ఆలయ గోపురం పనులు

మాడుగుల : స్థానిక గాంధీ పార్కు వద్ద వెలసిన విజయాంజనేయ స్వామి ఆలయ గోపురం పనులు శరవేగంగా జరగుతున్నాయి. రానున్న హనుమాన్ జయంతి నాటికి పనులు పూర్తి చేయడానికి సుమారు రూ. 5 లక్షలతో నిర్మాణం చేపడుతున్నారు. గోపుర నిర్మాణంతో పాటు శ్రీరాముని పట్టాభిషేకం నిర్మాణానికి దాతలు ఆలయ కమిటీ కోరుతుంది.

వైభవంగా తలుపులమ్మ పండగ

కె.కోటపాడు : పాచిలవానిపాలెం గ్రామస్తులు తలుపులమ్మ అమ్మవారి పెద్ద పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. కంచుగుర్రాలతో గ్రామంలో ఊరేగింపు, తోలేలు, ఘటాలు, రథంతో పండగను భక్తిశ్రద్ధలతో చేశారు. అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాలు జరిపేందుకు బారులు తీరారు.

తలుపులమ్మ పండగ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ ఘనంగా దుశ్శాలువాలతో సన్మానం చేశారు. అమ్మవారిని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, ఈశ్వరమ్మ, మాజీ సర్పంచ్ బోశం కృష్ణారావు, గొర్రుపోటు వెంకటరావు, ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, చీపురపల్లి అచ్చిబాబు, రొంగలి రమేష్, వంటాకు గోవిందరావు, శ్రీకాంత్ శ్రీను దర్శించుకున్నారు.

ఏజెన్సీ ప్రాంతాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు శ్రీనివాసరావు

గంగవరం: నూగుమామిడిలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. పలువురు పార్టీలో చేరారు. నాయకులు స్వప్న కుమారి, బాపన్న దొర, ధర్మరాజు, నానాజీ, నరేష్, కాటం రెడ్డి , సర్పంచ్ కురసం అక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.